నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, శుక్రవారం 27 డిసెంబర్ 2024 | HANUMAKONDA

భూపాలపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

ఆలయంపై రాజకీయమా?

- అసంపూర్తి పనులతోనే ఎండోమెంట్‌కు అప్పగిస్తారా..
- ఎమ్మెల్యేకు ఎందుకంత తొందర.. కుట్ర చేయడం సరికాదు
- నిర్మాణం పూర్తయ్యాక అప్పగించేందుకు మేము సిద్ధం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, డిసెంబర్ 26: అసంపూర్తిగా ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రాజకీయాలు చేయడం సరైంది కాదని గుడి ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక కల్యాణం కోసం, భక్తుల దర్శనార్థం ఏడాదిలోనే ఆలయాన్ని నిర్మించి, వేంకటేశ్వర స్వామి వారిని ప్రతిష్ఠించుకున్నామన్నారు. ఆలయంలో రాజ గోపురం, ఉత్తర ద్వారం, యాగశాల, ప్రహరీ, పాకశాల నిర్మాణం పనులు ఇంకా చేయాల్సి ఉందని, సంక్రాంతి తర్వాత పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని శిల్పులు చెప్పారన్నారు. ఈ క్రమంలో ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తూ కుట్ర చేయడం సరైనది కాదన్నారు. ఎమ్మెల్యేకు ఎందుకంత తొందర, పనులు పూర్తయిన తర్వాత టీటీడీకి లేదా ఎండోమెంట్ శాఖకు అప్పగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, నా భార్య గండ్ర జ్యోతి ఆలయ నిర్మాణం ప్రారంభం నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగేంత వరకు బాయిల్డ్ గుడ్డు కూడా తినలేదని, భూపాలపల్లి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి 26 రోజులు పాదయాత్ర చేసిందన్నారు. తాను ఒక్కడినే ఆలయాన్ని నిర్మించలేదని, ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసుకొని అందరి సమక్షంలో నిర్మించామన్నారు. ఆలయ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ రావు గాలి మాటలు మాట్లాడుతున్నాడని, తాను ఆలయంలో ఉండి చెప్తున్నా.. ఒక్క రూపాయి కూడా అవకతవకలు జరగలేదని సవాల్ విసిరారు. గండ్ర సత్యనారాయణ రావు ఎమ్మెల్యేగా గెలిచిన తెల్ల వారి నుంచి ఆలయం మీద పడి తన అధికార జులుంను చూపిస్తున్నాడని పేర్కొన్నారు. ఆలయానికి ఆదాయం వచ్చేందుకు, పూజారులు ఉండేందుకు భవనాన్ని నిర్మిస్తే ఎమ్మెల్యే వంకర బుద్ధి ఆలోచనతో కేసు పెట్టిస్తే, హైకోర్టు నుంచి స్టే తెచ్చానన్నారు. ఆలయం నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు దేవాదాయ శాఖకు అప్పగించకుండా ఆ శాఖ మంత్రి కొండా సురేఖ ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజుపటేల్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు జక్కం రవికుమార్, ఎడ్ల మౌనిక, ముంజంపల్లి మురళీధర్, బద్ది సమ్మయ్య, కో ఆప్షన్ మెంబర్ బెతోజు వజ్రమణి, బీబీ చారి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సెగ్గం సిద్దు, బీబీ చారి, గడ్డం కుమార్ రెడ్డి, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, మందల విద్యాసాగర్ రెడ్డి, నలిగేటి సతీశ్‌కుమార్, చుక్క బాలరాజు, పిల్లి వేణు, గురుజాల శ్రీనివాస్, దుంద్ర కుమార్ యాదవ్, మోతే రాజు, చిన్నాల ప్రవీణ్, శేఖర్, కృష్ణమూర్తి, యూత్ నాయకుడు భాస్కర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలసముద్రంలోని వెహికిల్ షెడ్‌లో మూలనపడిన పారిశుధ్య వాహనాలు

స్మార్ట్‌సిటీగా చెప్పుకుంటున్న వరంగల్ నగరంలో పారిశుధ్యం మూలన పడింది. చెత్త తరలించే వాహనాలు రిపేర్ షెడ్‌లో తుప్పుపడుతున్నాయి. 50 స్వచ్ఛ ఆటోలు, 20 ట్రాక్టర్లు మరమ్మతుల పేరుతో మూలుగుతున్నాయి. దీంతో గ్రేటర్‌లోని అనేక కాలనీల్లో 10 రోజులకోసారి కూడా స్వచ్ఛ ఆటోలు రాకపోవడంతో ఇంట్లో చెత్త పేరుకుపోతున్నది. అపార్ట్‌మెంట్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. అత్యంత ప్రాధాన్యత కలిగిన పారిశుధ్య వ్యవస్థను బల్దియా అధికారులు గాలికొదిలేయడంతో ఎక్కడికక్కడే కంపు కొడుతోంది. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయ లోపంతో ఈ సమస్య జఠిలంగా మారుతోంది. - వరంగల్, డిసెంబర్ 26

మూలనపడిన పారిశుధ్యం

- షెడ్‌లో 70కి పైగా వాహనాలు.. మరమ్మతుల కోసం నెలల తరబడి జాప్యం
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- గ్రేటర్ వరంగల్‌లో రోజుల తరబడి వాడలకు రాని స్వచ్ఛ ఆటోలు
- పేరుకుపోతున్న చెత్త.. ఎక్కడికక్కడే కంపుకొడుతున్న పరిసరాలు

నగరంలో చెత్త తరలించే వాహనాలు రిపేర్ షెడ్‌లకే పరిమితమవుతున్నాయి. రోజుల తరబడి స్వచ్ఛ ఆటోలు ఇంటికి రావడం లేదన్న ఫిర్యాదులు వందల్లో వస్తున్నాయి. 407 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణకు 360 స్వచ్ఛ ఆటోలు, 80 ట్రాక్టర్లు ఉన్నాయి. ప్రతి రోజూ ఇంటింటి చెత్త సేకరణ, డంపింగ్ యార్డులకు తరలింపులో కీలకంగా ఈ వాహనాలు పనిచేస్తున్నాయి. అయితే వీటిలో రోజూ సుమారు 100 వాహనాలు వివిధ రిపేర్ల పేరుతో రోడ్డెక్కడం లేదు. 50 స్వచ్ఛ ఆటోలు, 20 ట్రాక్టర్లు మరమ్మతుల పేరుతో మూలునపడ్డాయి. దీంతో నగరంలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది.

నెలల తరబడి షెడ్‌లోనే..

వివిధ రిపేర్లతో చెత్త తరలించే వాహనాలకు వెంటనే మరమ్మతులు చేయకపోవడంతో నెలల తరబడి షెడ్‌లోనే ఉంటున్నాయి. కొత్త వాహనాలు సైతం తుప్పుపడుతున్నాయి. స్వచ్ఛ ఆటోలు 50పైగా, 20 ట్రాక్టర్లు, డంపర్ బిన్స్, కంపాక్టర్ బిన్స్‌లు పదుల సంఖ్యలో షెడ్‌లోనే ఉన్నాయి. మరమ్మతులపై అధికారుల పర్యవేక్షణ కరువవడంతో ఎన్ని వాహనాలు రిపేరులో ఉన్నాయి?, ఎన్ని క్షేత్రస్థాయిలో తిరుగుతున్నాయన్న దానిపై సరైన లెక్కలు తెలియకపోవడం గమనార్హం. బల్దియాలో పారిశుధ్య వాహనాల వినియోగమంతా ప్రజారోగ్య విభాగం, మరమ్మతులు ఇంజినీరింగ్ విభాగం చూసుకుంటుంది. వాహనం మరమ్మతు కోసం ప్రజారోగ్య విభాగం అధికారి షెడ్‌కు పంపిస్తే ఇంజినీరింగ్ విభాగం అధికారి అప్రూవల్ ఇస్తేనే రిపేరు చేస్తారు. ఇద్దరి మధ్య సమన్వయం లోపంతో రోజుల తరబడి వాహనాలు రిపేర్ల కోసం షెడ్‌లో ఉండాల్సి వస్తోంది.

మరమ్మతుకు గురైన లారీని కమ్మేసిన చెట్ల పొదలు

లక్ష్యం చేరని ఇంటింటి చెత్త సేకరణ

క్లీన్ సిటీ లక్ష్యం నెరవేరాలంటే ఇంటింటి చెత్త సేకరణ అత్యంత కీలకం. ప్రతి రోజూ స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాలి. అయితే గ్రేటర్‌లోని అనేక కాలనీల్లో 10 రోజులకొకసారి కూడా స్వచ్ఛ ఆటోలు వెళ్లడం లేదు. రోజు వందల ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో చెత్త పేరుకుపోతున్నది. ప్రతి నెల రూ.60 చెత్త పన్ను పేరిట ఆస్తి పన్నులో కలిపి వసూలు చేస్తున్న బల్దియా అధికారులు చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. చెత్త వాహనాల కొరత ఒకవైపు.. రిపేర్ల పేరుతో రోడ్డెక్కని వాహనాలతో నగర పారిశుధ్య వ్యవస్థ పడకేసింది.

నెలల తరబడి రిపేర్ షెడ్‌లో ఉండడంతో ఖండమైన వాహనాలు, డంపర్ బిన్లు

నామినేటెడ్ లొల్లి

కాంగ్రెస్‌లో పెరుగుతున్న అసంతృప్తులు

- వలస నేతలకు ప్రాధాన్యతపై పాత శ్రేణుల నారాజ్
- జిల్లా స్థాయి పోస్టులు భర్తీ చేయకపోవడంపై ఆగ్రహం
- అధికార పార్టీ ఎమ్మెల్యేలకు తగులుతున్న సెగ
- ఇటీవల నాయిని రాజేందర్‌రెడ్డి ఎదుటే గొడవ

అధికార పార్టీలో పాత, వలస నేతల మధ్య పంచాయితీ ముదురుతున్నది. పదేండ్లు పార్టీ కోసం పని చేసిన వారిని కాదని కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై అసంతృప్తి పెరుగుతున్నది. దీనికి తోడు భర్తీ చేసిన ఒకటిరెండు నామినేటెడ్ పదవులు సైతం వారికే కట్టబెట్టడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇది ఇంకాస్త రాజుకొని ఎమ్మెల్యేల ఎదుటే గొడవలకు దిగే స్థాయికి చేరుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పడాది గడవడం.. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయకపోవడంపై పాత నేతలు బాహాటంగానే నిరసన తెలుపుతున్నారు. కనీసం జిల్లా స్థాయి పోస్టులు ఇప్పించడంలోనూ ఎమ్మెల్యేలు నిర్లక్ష్యంగా ఉంటున్నారని, చొరవ చూపడం లేదని విమర్శిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టపడి పని చేసిన తాము పార్టీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులను ఆశించడం న్యాయమైన డిమాండ్ అంటున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో చాలా మందికి పదవులు ఇవ్వాల్సి ఉందని, కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదంటున్నారు. మరికొన్ని నెలలు ఇలాగే సాగదీస్తే అసంతృప్తి మరింత పెరుగుతుందని పాత నేతలు హెచ్చరిస్తున్నారు.

- వరంగల్, డిసెంబరు 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కొన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. ఇలా భర్తీ చేసిన వాటిలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇవ్వడంతో పాత నేతలు ఆగ్రహంగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు, ఆ తర్వాత పార్టీలో చేరిన నేతలకు ప్రాధాన్యత ఇవ్వడం, వారికే నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టడంపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. గత ప్రభుత్వంలో దాదాపు మొత్తం కాలం నామినేటెడ్ పోస్టును అనుభవించి, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన ఓ నాయకుడికి ఎమ్మెల్యే నాయిని అనవసర ప్రాధాన్యత ఇస్తున్నారని అధికార పార్టీలోని ఓ కార్పొరేటర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నాయిని ముందే కార్పొరేటర్, ఆయన అనుచరులు.. వలస నేతపై దాడి చేసినంత పని చేశారు. సర్దిచెప్పే ప్రయత్నం చేసిన ఎమ్మెల్యేపైనా అక్కడున్న కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల వారిని తీసుకోవాల్సిన అవసరం ఏముందని, వారికే పదవులు ఎందుకు ఇచ్చారని ఎమ్మెల్యేను నిలదీశారు. ఓ స్కూల్‌లో జరిగిన ప్రైవేట్ కార్యక్రమంలో ఇది జరిగింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవ తీసుకోకపోవడం వల్లే తమకు నామినేటెడ్ పదవులు దక్కడంలేదని పలువురు నేతలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేలపై అసంతృప్తి

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కొత్తలో రాష్ట్ర వ్యాప్తంగా 37 కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన పొదెం వీరయ్య, జంగా రాఘవరెడ్డి, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఎండీ రియాజ్, బెల్లయ్యనాయక్, అయిత ప్రకాశ్‌రెడ్డికి పదవులు ఇచ్చింది. నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలోని నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదని పాత నేతలు అంటున్నారు. మార్కెట్, ఆలయ కమిటీలు, జిల్లాస్థాయి పోస్టుల భర్తీ విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యంగా ఉండడంపై పాత నేతల్లో అసహనం పెరుగుతున్నది. కొత్తగా వచ్చిన వారికి ఇచ్చేందుకే భర్తీ ప్రతిపాదనలను వాయిదా వేస్తున్నారనే అనుమానాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. 'మీకు కావాల్సింది మీకు దక్కింది. మరి మా సంగతి ఏమైంది' అని ఇటీవల గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఓ ఎమ్మెల్యేను కొందరు అధికార పార్టీ నేతలు ప్రశ్నించినట్లు తెలిసింది. ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యే అయిన నాయకుడికి ఇప్పుడు ఈ అసంతృప్తి సెగ మరింత ఎక్కువగా ఉంది.

అప్పు చేసి డబ్బులు చెల్లించినం

- ప్రతి నెలా వడ్డీ భారంగా మారుతున్నది
- మాకు రుణమాఫీ ఎప్పుడవుతుంది?
- అధికారులను ఆరా తీస్తున్న రైతులు

ఏటూరునాగారం, డిసెంబర్ 26 : ప్రభుత్వం ప్రకటించిన రూ. 2లక్షల రుణ మాఫీ కోసం ఏజెన్సీలోని రైతులు బ్యాంకు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆరా తీస్తున్నారు. విజయోత్సవ వేడుకల సందర్భంగా రుణమాఫీ కాని వారంతా అసలు అవుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసినా ప్రకటన చేయకపోవడంతో నిరాశతో రైతులు దిగాలు చెందుతున్నారు. రూ. 2లక్షలకు పైబడి ఉన్న రుణాన్ని చెల్లిస్తే మిగిలిన మొత్తం మాఫీ అవుతుందన్న మంత్రుల ప్రకటనతో అప్పు చేసి మరీ బ్యాంకుల్లో చెల్లించారు. రుణ మాఫీ జరిగితే మళ్లీ వెంటనే పంట రుణం తీసుకోవచ్చనే ఆశతో మూడు నెలల క్రితమే అదనపు డబ్బులను బ్యాంకుల్లో కట్టారు. తీరా మాఫీ కాకపోవడంతో ప్రతి రోజూ ఎప్పుడవుతుందా అని ఎదురు చూస్తున్నారు. రుణ మాఫీ జరగకపోగా కొత్త అప్పు చేశామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటూరునాగారంలో ఎస్‌బీఐ, పీఎన్‌బీ, కెనరా, ఏపీజీవీబీ బ్రాంచులున్నాయి. వీటన్నింటిలో సుమారు 600 మంది రైతులకు అప్పులున్నట్లు సమాచారం. ఈ బ్యాంకుల చుట్టూ తిరగడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్ చేసి సార్ ఏమైనా సమాచారం వచ్చిందా? అంటూ తెలుసుకుంటున్నారు. అధికారుల నుంచి సరైన సమాధానం రావడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. మిర్చి సాగు చేసిన రైతులు ప్రస్తుతం పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్నారు. రుణమాఫీ జరిగి తిరిగి రుణం ఇస్తే తెచ్చిన అప్పు కట్టుకోవడంతో పాటు పంట పెట్టుబడికి ఉపయోగపడుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. కొంత మంది రైతులు బంగారం, ఆస్తులు తాకట్టు పెట్టి బ్యాంకులో రూ. 2లక్షలకు పైగా ఉన్న డబ్బులను చెల్లించారు. రుణ మాఫీ కాకపోగా తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టడం భారంగా మారిందని రైతులు వాపోతున్నారు.

అప్పు చేసి రూ. లక్ష కట్టా..

నా పేరిట రూ. 2.74 లక్షలు పంట రుణం ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు రూ. లక్ష కట్టమంటే అప్పు చేసి బ్యాంకులో ఆగస్టు 22న చెల్లించాను. వెంటనే మాఫీ అయితే అప్పు తీర్చుదామనుకుంటే మాఫీ కావడం లేదు. కొత్త రుణం ఇవ్వడం లేదు. బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయా. రెండు నెలలుగా ఎదురు చూస్తున్నా. తెచ్చిన డబ్బులకు వడ్డీ కట్టాల్సి వస్తున్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రుణమాఫీ చేయాలి.

– కొప్పుల శ్రీనివాస్, ఏటూరునాగారం

యూరియా వచ్చింది..

నల్లబెల్లి పీఏసీఎస్‌కు చేరిన 500 బస్తాలు

నమస్తే ఎఫెక్ట్

నల్లబెల్లి, డిసెంబర్ 26 : నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు యూరియా చేరుకుంది. గురువారం 'గుళికలు కొంటేనే యూరియా' శీర్షికన యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లపై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పందించిన జిల్లా అధికారులు గురువారం పీఏసీఎస్‌కు 500 యూరియా బస్తాలను పంపించారు. అయితే పీఏసీఎస్ అధికారులు మాత్రం ఒక్కో రైతుకు రెండు యూరియా బస్తాలతో పాటు నానో యూరియా బాటిల్‌ను ఇస్తున్నారని, దీని కోసం రూ. 250 అదనంగా చెల్లించాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. కాగా, కృత్రిమ యూరియా కొరత సృష్టిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఆయా దుకాణాల్లో ఉన్న స్టాక్ వివరాలను వెల్లడించని అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నల్లబెల్లి పీఏసీఎస్ గోదాంలో దిగుమతి అవుతున్న యూరియా

రోడ్లు ఊడ్చి నిరసన

ములుగు రూరల్, డిసెంబర్ 26 : తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక దీక్ష గురువారం 17వ రోజుకు చేరుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు ప్రతిరోజు వినూత్నంగా నిరసన తెలుపుతున్నారు. ఈ మేరకు ములుగు జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయ రోడ్డును ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్‌పాడ్యా, జిల్లా మహిళా అధ్యక్షురాలు జీవన ప్రియ, కార్యవర్గ సభ్యులు సుజాత, వీ రాజేశ్వరి, జయ, వసంతలక్ష్మి, అశ్విని, సుజాత, అరుణ, భాగ్యలక్ష్మి, పుష్పనీల, ప్రవీణ్, రమణి, రమేశ్, సుబ్బారెడ్డి, తిరుమల, స్వప్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రోడ్డును ఊడ్చి నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

అప్పుడప్పుడు ప్రకృతిలో రూపుదిద్దుకున్న చిత్రాలు రంజింపజేస్తాయి. మనస్సుకు ఆహ్లాదాన్నిస్తాయి. చుట్టూ పచ్చటి అడవి.. పక్షుల కిలకిలరావాలు.. మధ్యలో అందమైన సరస్సు.. దాని మధ్యలో దీవిలాంటి గుట్టలు.. ముద్దాడినట్లుగా సరస్సులో వాటి ప్రతిబింబం.. చూడ ముచ్చటైన ఈ సోయగం పాకాల సరస్సులో కనువిందు చేయగా, గురువారం నమస్తే తెలంగాణ క్లిక్ మనిపించింది.

– ఫొటోగ్రాఫర్, వరంగల్

'ప్రైవేట్' నిర్లక్ష్యం.. బాలుడికి శాపం

- దవాఖానలో వికటించిన అపెండిసైటిస్ ఆపరేషన్
- నాలుగు నెలలకుపైగా తల్లడిల్లుతున్న చిన్నారి.. అప్పుల పాలైన పేద కుటుంబం
- వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు.. న్యాయం చేయాలని వేడుకోలు

వరంగల్, డిసెంబర్ 26 : నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రి నిర్లక్ష్యం.. బాలుడికి శాపంగా మారింది. దవాఖాన యాజమాన్యాలు కాసులకు కక్కుర్తి పడి ఏజెంట్లను నియమించుకొని ప్యాకేజీల పేరుతో ఒప్పందం కుదుర్చుకొని అనుభవం లేని డాక్టర్లతో అపరేషన్లు చేయించి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా జిల్లా వైద్యాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 6 నెలల క్రితం బంధన్ అసుపత్రిలో అపెండిసైటిస్ ఆపరేషన్ వికటించి చావు అంచుల దాకా వెళ్లిన ఘటన మరువక ముందే శ్రీఉదయ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖానలో జూలై 2న గురిజాల గ్రామానికి చెందిన కొక్కు తనీష్(13)కు చేసిన ఆపరేషన్ వికటించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్

కొక్కు తనీష్ కడుపు నొప్పితో బాధపడుతుంటే తండ్రి సదానందం హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకురాగా, పరీక్షలు చేసిన వైద్యులు ఇది అపెండిసైటిస్ అని, ఆపరేషన్‌కు రూ. లక్ష ఖర్చవుతుందని చెప్పారు. అంత ఖర్చు భరించే శక్తిలేక దిక్కుతోచని స్థితిలో ఉన్న సదానందంకు అక్కడే ఉన్న ఓ బ్రోకర్ శ్రీ ఉదయ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రూ. 40 వేల ప్యాకేజీతో ఆపరేషన్ చేస్తారని చెప్పాడు. రూ. 40 వేలు కట్టడంతో ఆపరేషన్ చేసి మూడు రోజుల తర్వాత డిశ్చార్జి చేశారు. ఇంటికి వెళ్లిన తర్వాత ఆపరేషన్ చేసిన చోట చీము కారడంతో దవాఖానకు తీసుకురాగా రెండు రోజులు ఉంచుకొని పంపించారు. ఇలా మూడు సార్లు కావడంతో ఆపరేషన్ చేసిన డాక్టర్ జితేందర్‌ను అడిగితే నిర్యక్షంగా సమాధానం చెప్పి ముఖం చాటేశాడు. ఈ క్రమంలో బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

మూడు నెలలకు స్పందించిన డీఎంహెచ్‌వో

దవాఖాన నిర్లక్ష్య వైద్యంపై డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్యకు ఫిర్యాదు చేసిన మూడు నెలలకు స్పందించి ఈ నెల 12వ తేదీన శ్రీఉదయ్, యశోద ఆసుపత్రికి బాలుడికి సంబంధించిన కేషీట్ పంపించాలని లేఖ రాశారు. ఎంజీఎం దవాఖాన సూపరింటెండెంట్‌కు లేఖ రాసి కేషీట్లను పరిశీలించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా శ్రీఉదయ్ ఆసుపత్రి నిర్లక్ష్య వైద్యంపై బాలుడి తండ్రి సదానందం వరంగల్ పోలీస్ కమిషనర్‌కు నాలుగు నెలల క్రితం, గత నెల మరోసారి ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ హనుమకొండ ఏసీపీని విచారించాలని ఆదేశించినా ఎలాంటి పురోగతి లేదు. తాము మానసికంగా కుంగిపోయాయని, ఆర్థికంగా నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం వేడుకుంటున్నది.